## శుభాకాంక్షలు



జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మాణిక్, అరవింద్ కుమార్

చాంద్రాయణగుట్ట: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నూతనంగా నియమితులైన జి.ప్రవీణ్ కుమార్‌ను అఖిల భారత గ్రాహక్ పంచాయతీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, టీజేపీ భాగ్యనగర్ జిల్లా లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ అడ్వకేట్ మాణిక్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. హైకోర్టు అడ్వకేట్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు కాటా అరవింద్ కుమార్‌తో కలిసి ఆయనకు పూలబొకే అందజేశారు. న్యాయవాది అంటే కేవలం వాదించే వ్యక్తి కాదని, న్యాయాన్ని పరిరక్షించే వ్యక్తి అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ నిజాయితీ, సేవా భావం కలిగి ఉండాలని వారు పేర్కొన్నారు.

## పేదలకు బియ్యం అందజేత



అఫ్జల్‌గంజ్: సమాజ సేవకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సౌత్ నిరంతరం పాటుపడుతుందని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సౌత్ నాయకుడు లయన్ రవిశంకర్ పేర్కొన్నారు. తరచూ తమ సంస్థ ఆధ్వర్యంలో పేదలకు బియ్యం సంచులతో పాటు ఇతర సామగ్రిని అందజేస్తూ సమాజ సేవలో పాలుపంచుకుంటున్నామన్నారు. స్థానిక వృద్ధ మహిళలకు ఆయన బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. నిరంతరం తమ సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు.

## ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత



కార్యక్రమంలో విద్యావేత్త జితేందర్ సింగ్, లాల్‌సింగ్

అబిడ్స్: ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని రిలయన్స్ హైటెక్ స్కూల్ విద్యాసంస్థల చైర్మన్, విద్యావేత్త జితేందర్ సింగ్ పేర్కొన్నారు. మారుతున్న యాంత్రిక జీవనంలో ప్రతి మనిషికి మానసిక ఉల్లాసం, ప్రశాంతత ఎంతో అవసరమన్నారు. శ్రీమద్భాగవత కథ ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జితేందర్ సింగ్ మాట్లాడుతూ..ప్రజల్లో మరింత భక్తిభావం పెంపొందించేందుకు తరచు పలు ఆధ్యాత్మిక కేంద్రాల్లో శ్రీమద్భాగవత కథ లాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లాల్‌సింగ్‌తోపాటు శంకర్ సింగ్, అమర్‌దీప్ సింగ్, అక్షయ్ సాహు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

అబిడ్స్: ఫెర్నాండెజ్ హాస్పిటల్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించినట్లు ఆసుపత్రి బ్రాండ్ లైఫ్ పీఆర్ హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రారంభమైన ఈ తల్లిపాల వారోత్సవాలు 7వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఈ సంవత్సరం తమ ఆసుపత్రిలో తల్లిపాలు ఇవ్వడానికి ప్రాధాన్యమివ్వాలన్న థీమ్‌తో ముందుకు సాగుతున్నామన్నారు. పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవి, తల్లిపాలు తీసుకోవడంతో పిల్లలకు అన్ని రకాల విటమిన్‌లు లభిస్తాయని తెలిపారు. ఆసుపత్రిలో ఏడు రోజుల పాటు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించి తల్లి పాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించబడుతుందన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. రెయిన్‌బజార్ డివిజన్ ఎస్ఆర్టీ కాలనీలో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆయన కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇప్పటికే పలు ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్, సీసీ, బీటీ రోడ్లు, నాలా విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు.

# అధ్వాన రోడ్లతో అవస్థలు

- పాతబస్తీలో గుంతలమయంగా రహదారులు
- తరచూ ప్రమాదాల బారిన వాహనదారులు
- రోడ్ల మరమ్మతులను విస్మరిస్తున్న సంబంధిత అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు



పిల్లిగుడిసెలు డబుల్ బెడ్ రూం ముందు శిథిలావస్థకు చేరిన ప్రధాన రోడ్డు



పురానీహవేలీ చౌరస్తాలో గుంతలమయమైన ప్రధాన రోడ్డు

చార్మినార్: పాతబస్తీలోని కొన్ని ప్రాంతాల్లో అంతర్గత రోడ్లతో పాటు ప్రధాన రోడ్లు సైతం గుంతలమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వర్షా కాలంలో వరద నీటి ప్రవాహానికి రోడ్లు కొట్టుకుపోయి గోతులమయంగా మారుతాయని చెప్పే జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు వాటిని వెనువెంటనే బాగు చేయించాల్సిన బాధ్యతలను విస్మరిస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎలాంటి వర్షాలు లేకున్నా రోడ్లన్నీ గుంతలమయంగా ఎందుకు మారుతున్నాయో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు.

### జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలో..

జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలో ఒక్కో శాసన సభ నియోజకవర్గానికి ఒక్కో సర్కిల్ ఉంది. ఒక్కో సర్కిల్‌కు డిప్యూటీ కమిషనర్‌తో పాటు ఇంజినీరింగ్ విభాగం కూడా ఉంది. ఆయా సర్కిల్స్ ఇంజినీరింగ్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్థాయి నుంచి డీఈఈలు, ఏఈఈలతో పాటు క్షేత్ర స్థాయిలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు విధులు కొనసాగిస్తుంటారు. ఇంత మంది అధికారులు పని చేస్తున్నా పాతబస్తీ రోడ్లు మాత్రం బాగుపడడం లేదు. సర్కిల్–6 (మలక్‌పేట్), సర్కిల్–7 (సంతోష్‌నగర్), సర్కిల్–8 (చాంద్రాయణగుట్ట), సర్కిల్–9 (చార్మినార్), సర్కిల్–10 (ఫలక్‌నుమా), సర్కిల్–11(రాజేంద్రనగర్)లలో రోడ్లు విస్తరించి ఉన్నాయి. దీనికి తోడు జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ విభాగం ఇంజినీరింగ్ అధికారులు సైతం విధినిర్వహణలో ఉంటున్నారు.

### అభివృద్ధి పనుల పేరుతో అడ్డంగా తవ్వేస్తున్నారు..

వీటిల్లో కొన్ని ప్రధాన రోడ్లు అక్కడక్కడ బాగున్నప్పటికీ..అభివృద్ధి పనుల పేరుతో అడ్డంగా తవ్వేస్తున్నారు. పనులు పూర్తి అయిన అనంతరం శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయడం లేదు. దీంతో వాహనదారులకు సమస్యలు తలెత్తుతున్నాయి. ఒకేచోట రోడ్డుపై గోతులు ఏర్పడితే..అక్కడ పూర్తిస్థాయి మరమ్మతులు చేయకుండా అక్కడక్కడ పాట్‌హోల్స్ మూసేసి చేతులు దులుపుకుంటున్నారు. గోతుల్లో డాంబర్ వేసిన అనంతరం దానిని రోడ్డు రోలర్ ద్వారా చదును చేయాల్సిన సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. వారం పది రోజులకు ఈ డాంబర్‌లోని చిన్నచిన్న కంకర వాహనాల ధాటికి కొట్టుకుపోతోంది. తిరిగి గోతులు యథాతథంగా తయారవుతున్నాయి.

**రోడ్లకు మరమ్మతు చేయించండి.**



పాతబస్తీలో ఒకప్పటికన్నా ప్రస్తుతం రోడ్లు అందుబాటులో ఉన్నప్పటికీ సరైన మరమ్మతు పనులు జరగకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. చంచల్‌గూడ పిల్లిగుడిసెలు డబుల్ బెడ్ రూం ముందు గల ప్రధాన రోడ్డు ఏళ్ల తరబడి శిథిలావస్థకు చేరింది. వెంటనే రోడ్లకు మరమ్మతు చేయించండి.
– మహ్మద్ ఘనీ, చంచల్‌గూడ

**చర్యలు తీసుకుంటున్నాం..**



మా పరిధిలోని ప్రధాన రోడ్ల మరమ్మతులతో పాటు అంతర్గత రోడ్ల మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఎక్కడైనా రోడ్లు శిథిలావస్థకు చేరుకుంటే..మా దృష్టికి తీసుకు వస్తే తగిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అక్కడక్కడ పనులు చేయిస్తున్నాం.
– మల్లికార్జున్, జీహెచ్‌ఎంసీ ఏఈ

**మా దృష్టికి తెస్తే వెంటనే స్పందిస్తాం..**



జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్స్ విభాగానికి చెందిన రోడ్ల మరమ్మతులను మేము సాధ్యమైనంత వెంటనే నిర్వహిస్తున్నాం. ప్రధాన రోడ్లలో సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా మరమ్మతులు అవసరం ఉంటే మా దృష్టికి తెస్తే వెంటనే స్పందిస్తాం.
– హర్షిత్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్స్ ఏఈ

## గుదిబండి మరణం సాంస్కృతిక రంగానికి తీరని లోటు



గుదిబండి వెంకట్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మద్దాళి రఘురామ్

నాంపల్లి: జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ గుదిబండి వెంకట్‌రెడ్డి సంస్మరణ సభ మాసబ్‌ట్యాంక్‌లోని గోల్కొండ హోటల్‌లో జరిగింది. సాంస్కృతిక సంస్థల సంయుక్త నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో పలువురు కళాకారులు, సాంస్కృతిక సంస్థల నిర్వాహకులు, కవులు హాజరై గుదిబండి వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. యువ కళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, కిన్నెర సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్, కళా పత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ, వంశీరామరాజు, సంజయ్ తదితరులు హాజరై ప్రసంగించారు. గుదిబండి వెంకట్‌రెడ్డి సాంస్కృతిక రంగానికి చేసిన కృషిని కీర్తించారు. ఆయన లేని లోటు సాంస్కృతిక రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పలు నిరుపేద కుటుంబాల వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలో వేలాది నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన దళితులు, మైనార్టీలు, బీసీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఒక వరంలా పని చేశాయన్నారు.

**గోల్కొండ కోటకు మహర్దశ..**

గోల్కొండ కోట, సెవన్ టూంబ్స్‌కు వచ్చే పర్యాటకులకు త్వరలోనే రోప్ వే సౌకర్యం కలగనున్నదని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో గోల్కొండ కోట–సెవన్ టూంబ్స్ మధ్య కేబుల్ కార్ సౌకర్యం లభించనుందని అన్నారు. రెండేళ్ల క్రితమే తాను ఈ పథకం ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించానన్నారు. దీనికి పలుమార్లు గోల్కొండ సెవన్ టూంబ్స్ తదితర ప్రాంతాల్లో అధికారుల బృందం పర్యటించిందన్నారు. ప్రతినిత్యం వేల సంఖ్యలో గోల్కొండ కోటకు వచ్చే పర్యాటకులకు సెవన్ టూంబ్స్ సందర్శించే విధంగా రోప్ వేను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దీని కోసం ఇప్పటికే ప్రభుత్వం చేపట్టిన ప్రీబిడ్డింగ్ సమావేశంలో అనుకూల స్పందన వచ్చిందన్నారు.

## సామాజిక సేవలో విద్యార్థుల పాత్ర కీలకం



కాలేజీ ఎన్ఎస్ఎస్ అధికారులతో ప్రొ.విద్యాసాగర్

చార్మినార్: సామాజిక సేవలో విద్యార్థుల పాత్ర కీలకమని ఓయూ ఎన్ఎస్ఎస్ అధికారి ప్రొ.విద్యాసాగర్ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో నూతనంగా చేరిన విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి తోడ్పడే వేదిక జాతీయ సేవా పథకమని, 'నేను కాదు నువ్వు'అనే నినాదంతో స్వార్థం విడిచి సేవాభావాన్ని పెంపొందిస్తుందన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా మాట్లాడుతూ..విద్యార్థి దశలో ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనటం వల్ల సామాజిక స్థితిగతులపై విద్యార్థులకు అవగాహన పెరుగుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా.పి.శాంతి, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.వి.శ్రీదేవి, డా.రవీంద్రబాబు, డా. బి.సుదక్షణ, డా.ఎల్. తిరుపతి, డా.కృష్ణ చంద్ర కీర్తి, సమన్వయ కర్త డా.డి.నాగరాజు, డా.ఆనంద్, డా. మల్లికార్జున్, డా.కోయి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి

సుల్తాన్‌బజార్: సీసీ కెమెరాలను ప్రతి ఒక్కరూ ఏర్పాటు చేసుకోవాలని ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి సూచించారు. శుక్రవారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో కోఠిలోని ఐఎంఏ హాల్‌లో ప్రజలకు సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీసీపీ హాజరై సుల్తాన్‌బజార్ ఏసీపీ మట్టయ్య, ఇన్‌స్పెక్టర్ నర్సింహాతో కలిసి మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న నేరాల అదుపులో ఉంచడానికి సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. రద్దీ ప్రాంతాల్లో, అనుమానాస్పద స్థలాల్లో ఆయా బస్తీ, కాలనీలు, సహకార సంఘాల నాయకులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలన్నారు. అనుమానాస్పద వస్తువులు కానీ, వ్యక్తులు కానీ కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీసీపీ కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఈస్ట్‌జోన్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, వివిధ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

## 72 కుటుంబాలకు ఇళ్ల పట్టాలివ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్ రవీంద్రనాయక్‌నగర్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం కోసం తమ ఇంటి స్థలాలను ఇచ్చిన 72 కుటుంబాలకు వెంటనే పట్టాలు ఇవ్వాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి ఎ.కృష్ణా నాయక్ కోరారు. ఈ మేరకు శుక్రవారం బాధితులతో కలిసి బండ్లగూడ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పదేళ్ల క్రితం ఇంట్లో ఉన్న వారిని ఖాళీ చేయించి 252 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించారన్నారు. ఇళ్ల స్థలాలు ఇచ్చిన వారికి ఇప్పటికీ కూడా పట్టాలు ఇవ్వడం లేదన్నారు. 72 కుటుంబాలు డబుల్ ఇళ్లల్లోకి వెళ్లితే ఆయా ఇళ్లకు తాగునీటి, కరెంట్ కనెక్షన్లు కట్ చేస్తున్నారన్నారు. గత కలెక్టర్ పట్టాలిస్తామని మాట ఇచ్చి..అంతలోనే బదిలీ అయ్యారన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వీరికి పట్టాలివ్వాలని, లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీను, శేఖర్, సంగీత, పార్వతమ్మ, రేణుక, సుశీల, అక్రూబాయి తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు ఉత్తమ సేవలందించడమే లక్ష్యం



రవీందర్‌రావుకు జ్ఞాపికను అందజేస్తున్న అపెక్స్ బ్యాంక్ ఉద్యోగులు

గన్‌ఫౌండ్రీ: వినియోగదారులకు ఉత్తమ సేవలందించడమే లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ ఎం.రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం అబిడ్స్‌లోని తెలంగాణ రాష్ట్ర అపెక్స్ బ్యాంక్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంక్ సభ్యులతో పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమర్థవంతమైన నాయకత్వం, మార్గదర్శకత్వం, శిక్షణ, రీఫైనాన్స్ సేవలను అందించడం ద్వారా దేశంలోనే ఉత్తమ బ్యాంక్‌గా అవతరించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంక్‌గా విభజన అనంతరం గత పదేళ్లుగా ఇరు బ్యాంకుల మధ్య పరస్పర సహకారం, పదోన్నతులు, ఉద్యోగుల సమస్యలు చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి సమగ్రంగా చర్చలు జరిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఏఎఫ్ఎస్‌సీఓబీ చైర్మన్ కె.రవీందర్‌రావు, తెలంగాణ సహకార బ్యాంక్ వైస్ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య, ఎండీ వైకె.రావు, సీజీఎం జ్యోతి, జీఎం లత, డీజీఎం శ్రీనివాసరావు, ధినేష్, రాజు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



విద్యాలక్ష్మిగా లక్ష్మీదేవి



వెన్న, బాదంతో నల్ల పోచమ్మ

విజయనగర్‌కాలనీ: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో మహిళలు వరలక్ష్మీ పూజలు నిర్వహించారు. ఆసిఫ్‌నగర్, విజయనగర్‌కాలనీ, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో మహిళలు తమ ఇంటికి ముత్తైదువులను ఆహ్వానించి, పసుపుకుంకుమలతో పాటు వాయనాలు ఇచ్చి ఆశీస్సులు పొందారు.

### రంగనాథస్వామి ఆలయంలో..

జియాగూడ: జియాగూడ రంగనాథస్వామి ఆలయంలో శ్రావణ మాస పూజలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి శేషాచారి అన్నారు. శుక్రవారం ఆలయంలో లక్ష్మీదేవిని విద్యాలక్ష్మిగా ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన సౌభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాస రంగనాథ బట్టాచార్యులు మాట్లాడుతూ..శ్రావణ మాసంలో నాలుగు శుక్రవారాల పాటు లక్ష్మీదేవిని వరలక్ష్మీ దేవిగా, సంతాన లక్ష్మీ దేవిగా, ఐశ్వర్య లక్ష్మీ దేవిగా ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు.

### నల్ల పోచమ్మ ఆలయంలో..

గౌలిపురా: హనుమాన్‌నగర్ ఫేజ్–2లోని నల్లపోచమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని వెన్న, బాదంతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని అలంకరించిన వెన్నను సాయంత్రం భక్తులకు ప్రసాదంగా అందజేశారు.

## నేడు సెయింట్ ఆన్స్ కళాశాలలో 'మెట్ గళా'

గోల్కొండ: ఈ నెల 2న మెహిదీపట్నం సంతోష్‌నగర్‌లోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో మెట్ గళా, రీ అవేకినింగ్ ఫ్యాషన్ నిర్వహిస్తున్నామని స్టూడెంట్ క్వాలిటీ అసూరెన్స్ సెల్ అధ్యక్షురాలు అమీనా తెలిపారు. ఈ మెగా ఈవెంట్‌ను శనివారం ఉదయం 9 గంటలకు కళాశాలలోని ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామన్నారు.

## ముగిసిన డ్రోన్ శిక్షణ శిబిరం



గోల్కొండ: శాస్త్రసాంకేతిక రంగాల్లో వస్తున్న ఆవిష్కరణలను విద్యార్థులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ వారిలో నైపుణ్యాన్ని పెంచేలా కృషి చేస్తున్నామని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్‌పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి అన్నారు. కళాశాలలో విద్యార్థినుల కోసం అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ వారి సహకారంతో ఐదు రోజుల పాటు నిర్వహించిన డ్రోన్ శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జీఎన్ఐటీఎస్‌లోని ఏఐసీ అత్యుత్తమమైనదని ఈ సెంటర్ వల్ల ప్రతి యేటా వేలాది మంది విద్యార్థినులు సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకుంటూ ఉన్నత ఉద్యోగాల్లో ఎంపికవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, వివిధ విభాగాల డీన్లు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## 4న మండలి వెంకటకృష్ణారావు శత జయంతి వేడుకలు

నాంపల్లి: ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల సూత్రధారి మండలి వెంకటకృష్ణారావు శత జయంతి మహోత్సవాల ప్రారంభ సభ ఈ నెల 4న సోమవారం సాయంత్రం 5 గంటలకు త్యాగరాయ గాన సభలో జరుగుతుందని కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ ఓ ప్రకటనలో తెలిపారు. కిన్నెర సంస్థ నిర్వహణలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణ అధ్యక్షతన ప్రారంభమయ్యే సభకు ముఖ్యఅతిథిగా హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరవుతున్నట్లు వివరించారు. వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి హాజరై సభను ప్రారంభిస్తారని తెలిపారు. అక్కినేని నాటక కళా పరిషత్ అధ్యక్షులు సారిపల్లి కొండలరావు, ఏపీ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ పూర్వ సంచాలకులు విశిష్ట అతిథులుగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు నృత్య కిన్నెర సమర్పణలో మా తెలుగు తల్లికి మల్లెపూదండ కూచిపూడి నృత్య రూపకం, 7.30 గంటలకు భువన విజయం సాహిత్య రూపకం ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

## సాయిబాబాచారికి సన్మానం



సాయిబాబాచారిని సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: వృత్తిపై నిబద్ధత, క్రమశిక్షణతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని శ్రీ గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయ వృత్తిపని సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి అన్నారు. నగరంలో వృత్తిపని వారికి గుర్తింపు తెచ్చేందుకు విశేషంగా కృషి చేసిన సాయిబాబాచారిని మహేష్‌గౌడ్ ట్రస్ట్ వారు సన్మానించారు. ట్రస్ట్ ప్రతినిధి అరవింద్‌గౌడ్ ఆయనకు శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి తదితరులున్నారు.

## పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్

సుల్తాన్‌బజార్: బస్తీ దవాఖానా సపోర్టింగ్ స్టాఫ్‌కు మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించడంపై తెలంగాణ బస్తీ దవాఖానా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మంగళపాటి సుమాన్, ప్రధాన కార్యదర్శి అమ్జద్ అలీఖాన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్సీ కోదండరాం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కన్వీనర్ ఉప్పలయ్య, సపోర్టింగ్ స్టాఫ్ ప్రతినిధిలు నర్సింహ, శాంతమ్మ, స్వప్న, అనిత, శ్రీలత, పావని, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు రుణాలు అందించాలి



తెలంగాణ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌కు కలిసిన మహ్మద్ జాహెద్

గోల్కొండ: దివ్యాంగులకు ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు వారికి రుణాలు ఇస్తున్నామని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఉబేద్దుల్లా కొత్వాల్ అన్నారు. శుక్రవారం గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహ్మద్ జాహెద్ ఆయనను కలిసి చైర్మన్‌గా నియమితులైనందుకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..టైలరింగ్ షాపు కోసం తాను చేసుకున్న దరఖాస్తును పరిశీలించి రుణం అందించాలని జాహెద్ అలీ ఆయనను కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దివ్యాంగులకు తాము కోట్లాది రూపాయల రుణాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఫెరోజ్, మహ్మద్ వాహిద్, బాబురావు తదితరులున్నారు.



**బహిరంగ ప్రకటన**

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ గడీల సుమిత్ర బాయి భర్త గడీల అర్జున్ సింగ్, తండ్రి ఓం.శ్రీ.రాజారాం సింగ్, వయస్సు 48 సం॥లు మరియు జె.శోభా బాయి, ఎం.విమలబాయి మరియు ఎస్.గోవింద్ సింగ్, నా క్లయింటు సొంత ఆస్తి అనగా గోల్కొండ మండలం, హైదరాబాద్ జిల్లా వద్ద సర్వే నెం.184, ఇబ్రహీంబాగ్ గ్రామము, భూమి 0–29 గుంటలు విస్తీర్ణం గల భూమి సంబంధించిన పార్టిషన్ దావా గౌరవ XVII Addl. Chief Judge, City Civil Court, Hyderabad, OS No.353 of 2023 దావా వేసినారు. పంచం సింగ్ మరియు కుటుంబీకులు కలిసి మరియు ఇతరులు కలిసి M/s. White Field Home Pvt. Ltd. Y.Madhu Babu మరియు M/s. Grand City Avenue Pvt. Ltd. T.Nageswar Rao, Sale Deed చేసుకున్నారు మరియు ఇతరుల మీద దావా దాఖలు చేశారని ఇందుమూలంగా సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది మరియు గౌరవ XVII Addl. Chief Judge, City Civil Court, Hyderabad న్యాయస్థానం జిల్లా పార్టిషన్ దావా మరియు డాక్యుమెంట్లు చెల్లనివిగా ప్రకటించుట కొరకు దావా పెండింగ్‌లో ఉన్నది. అది సదరు న్యాయస్థానం సమక్షంలో పెండింగ్‌లో ఉన్నది. పంచం సింగ్ మరియు వై.మధు బాబు మరియు టి.నాగేశ్వర రావు మరియు ఇతరులతో పై సదరు ఆస్తికి సంబంధించిన ఎవరైనా ఎలాంటి లావాదేవీలు మరియు ఇతరేత్ర లావాదేవీలు జరిపినచో వారు వారి సొంత పూచిపై చేసినట్లు అవుతుంది మరియు తదుపరిగా వారు వాటి నుండి ఏర్పడే అన్ని పర్యవసానాలకు బాధ్యులు అవుతారు.

Sd/- Shashikanth Tiwari
Advocate
# 9-1-184, Near Tiwari's Hanuman Temple
Lalithanagar, Langar House.
Hyderabad-500008.T.S. Cell No.9849236974